నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 20 జనవరి 2025 | RANGAREDDY




ధన్నారంలో అధికారులతో కలిసి ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## నేటితో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి కావాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ధన్నారంలో ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ తనిఖీ

వికారాబాద్, జనవరి 19 : రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆదివారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తనిఖీ చేశారు. మండలంలోని ధన్నారం గ్రామంలో సర్వే బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రైతుభరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకూ లబ్ధి చేసేందుకు.. సాగుకు యోగ్యమైన భూములను సర్వే నంబర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించడం జరుగుతుందన్నారు. ఈ నెల 20 వరకు ఆయా పథకాల కింద అర్హుల జాబితాలను రూపొందించి, 21 నుంచి 24 వరకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో జరుగనున్న గ్రామసభల్లో వాటిని ప్రవేశపెట్టి చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామసభ ఆమోదం మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ నెల 26న ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చనున్నదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, అధికారులు ఉన్నారు.

### రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

రేషన్ కార్డు దరఖాస్తులను గ్రామసభల్లో తీసుకుంటామని కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులను అందిస్తామన్నారు. గ్రామసభలు, వార్డులు, ప్రజాపాలన, సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వాటిని పరిశీలించి అర్హులకు జారీ చేస్తామన్నారు. ప్రజాపాలన ఫారంతోపాటు ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

### ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని స్థానిక ప్రజాప్రతినిధులను సమ న్వయం చేసుకుంటా రేషన్ కార్డుల వెరిఫికేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వికారాబాద్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. 21 నుంచి నిర్వహించనున్న గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటామని.. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## నెలాఖరులోగా హైడ్రా పీఎస్

సిటీబ్యూరో, జనవరి 19(నమస్తే తెలంగాణ): ఈ నెల చివరి వారంలో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ రంగనాథ్ తెలిపారు. బుద్ధభవన్‌లోని బీ బ్లాక్ మొదటి అంతస్తు మొత్తం హైడ్రా పీఎస్‌కు కేటాయించారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి ఈ నెల 7న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, అధికారులు పనులు స్పీడప్ చేశారు. స్టేషన్ ఏర్పాటు తర్వాత చెరువుల, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలతో పాటు ఫైర్ సేఫ్టీ వంటి వాటిపై వచ్చే ఫిర్యాదులను అనుసరించి కేసులను ఇక్కడ నమోదు చేస్తారు. అంతేకాకుండా సుమోటోగా కూడా కేసులు నమోదు చేసే అధికారం హైడ్రాకు ఉందని అధికారులు చెప్పారు. మరోవైపు పీఎస్ ప్రారంభానికి ముందే సిబ్బంది నియామక ప్రక్రియను కూడా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. పీఎస్‌కు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఏసీపీ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగిస్తారు. పీఎస్‌కు, హైడ్రాకు పోలీస్ శాఖ నుంచి ఇప్పటికే 169 మంది సిబ్బందిని కేటాయించడానికి ఆమోదం తెలుపగా, ఇందులో ఇద్దరు నాన్ కేడర్ ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 16 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 60 మంది కానిస్టేబుల్స్‌తో పాటు హోంగార్డులు, అనలిటికల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అనలిటికల్ ఆఫీసర్లు ఉంటారు. మరోవైపు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందిని కూడా హైడ్రాకు కేటాయించగా మరికొంతమంది పీఎస్‌కు అటాచ్ చేయనున్నారు.



వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో శర్వాని కూచిపూడి నృత్యాలయం వ్యవస్థాపకులు, గురువు డాక్టర్ భార్గవి ప్రేమ్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యరీతులు ఆకట్టుకున్నాయి. - కొండాపూర్

# సభలు పారదర్శకతకా.. పైరవీలకా..!

### సంక్షేమ పథకాల కేటాయింపుపై సర్వత్రా ఉత్కంఠ

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాలు ఎవరికి అందుతాయన్నదానిపై రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్నది. ఈ పథకాల కేటాయింపులో అధికారులు పారదర్శకత పాటిస్తారా.. లేక పైరవీలకు ప్రాధాన్యత ఇస్తారా అన్నదానిపై చర్చ జరుగుతున్నది. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించి.. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేసి.. అందులో మార్పులు, చేర్పులు చేసేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గ్రామ సభల నిర్వహణకు అధికారులు నిర్ణయించారు.

- రంగారెడ్డి, జనవరి 19 (నమస్తే తెలంగాణ)

### పథకాలకు పెద్దఎత్తున దరఖాస్తులు

ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు ప్రజలు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ఆధారంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలను మాత్రమే ఎంపిక చేస్తామని ముందుగా ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకతగా జరుగుతుందని చెప్పినప్పటికీ రాజకీయ నాయకుల జోక్యంతోనే లబ్ధిదారుల ఎంపిక జరిగినట్లు ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే ఆయా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తిచేశారు. సోమవారం పూర్తయిన జాబితాను సంబంధిత అధికారులకు అధికారులు అందించనున్నారు. ఈ జాబితాను ఆయా గ్రామసభల్లో ప్రజల ముందుంచి ఇందులో అర్హులు ఉన్నారా, అనర్హులున్నారా అన్నదానిపై చర్చించనున్నారు. గ్రామ సభల ద్వారా చర్చించిన తర్వాత ఆ వివరాలను కలెక్టర్‌కు అందజేస్తారు. కలెక్టర్ స్థాయిలో పరిశీలించిన తర్వాత తుది జాబితా ప్రకటించనున్నారు. గ్రామ సభల తర్వాత తయారుచేసే అభ్యర్థుల జాబితాలో స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు గ్రామాల్లో ఉన్న ఇందిరమ్మ కమిటీలు కూడా జాబితాను తయారుచేసి సంబంధిత ఎమ్మెల్యేలకు అందజేస్తున్నారు. దీంతో సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతాయా.. లేదా, రాజకీయ జోక్యంతో ఫైనల్ చేస్తారా అన్నదానిపై ఉత్కంఠ నెలకొన్నది.

### ఇందిరమ్మ ఇండ్ల కోసం 3.75 లక్షల దరఖాస్తులు

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సుమారు 3.75 లక్షల దరఖాస్తులు వచ్చాయి. నగర శివారుల్లో జిల్లా విస్తరించి ఉన్నందున వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చి స్థిరనివాసం ఏర్పర్చుకుని నివాసముంటున్నవారు ఎంతోమంది ఉన్నారు. వీరందరూ సొంత ఇండ్లు నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సమయంలోనే ప్రభుత్వం ఇండ్లు నిర్మించుకునేవారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద సుమారు రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఈ సమయంలోనే ఇందిరమ్మ ఇండ్ల కోసం 3.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కాని, జిల్లాకు ప్రభుత్వం మాత్రం 21 వేల ఇండ్లను మాత్రమే కేటాయించింది. 3.75 లక్షల మందిలో 21 వేల మందిని మాత్రమే ఎలా ఎంపిక చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పోలింగ్ బూత్‌కు పది ఇండ్ల చొప్పున కేటాయిస్తామని, పదిమందిని ఎంపిక చేసి లిస్టు ఇవ్వాలని ఇప్పటికే సంబంధిత ఎమ్మెల్యేలు ఇందిరమ్మ కమిటీలకు సూచించినట్లు తెలిసింది. ఓవైపు ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు లబ్ధిదారుల లిస్టు తయారుచేస్తుండగా, ప్రభుత్వం మాత్రం గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిచేస్తామని ప్రకటించింది.



ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామాల్లో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

- ఇప్పటికే పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి
- నేడు అధికారుల చేతికి రానున్న జాబితా
- మంగళ వారం నుంచి జిల్లావ్యాప్తంగా గ్రామ సభలు
- జిల్లాస్థాయిలో పరిశీలన అనంతరం తుది జాబితా విడుదల

### అర్హులకు రేషన్ కార్డులు అందజేయాలి



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు అనేక కల్లబొల్లి మాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేస్తున్నది. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తప్పనిసరిగా నెరవేర్చాలి. పేదలకు రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు బీమా పథకాలు అమలు చేయాలి. బీఆర్ఎస్ హయాంలో పంటల సాగు సమయంలో అన్ని రకాల పథకాలు అందేవి. కాని, కాంగ్రెస్ ఏమీ పట్టించుకోకుండా టైంపాస్ చేస్తున్నది. - దేరంగుల సత్యనారాయణ

### రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాలోనూ ఇదే తంతు..

అలాగే, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసాలో ఇదే తంతు కొనసాగుతున్నది. ఎన్నో ఏండ్లుగా రేషన్ కార్డులు లేక అనేక మంది కొత్త రేషన్ కార్డుల కోసం గత కొన్నేండ్లుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అలాగే, ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సహాయం కోసం మహిళలు కూడా పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వీరి ఎంపిక కూడా ఎలా జరుగుతుందనేది ఉత్కంఠగా మారింది. గ్రామ సభల్లో ఎంపిక చేస్తారా.. లేక ఎమ్మెల్యేలు ఎంపిక చేస్తారా అనేదానిపై పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది.

### పైరవీకారుల చుట్టూ ప్రదక్షిణలు

ఓవైపు ప్రభుత్వం గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేస్తామని చెబుతున్నప్పటికీ తెరచాటున పెద్దఎత్తున పైరవీలు జరుగుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా వంటి పథకాలు తమకే ఇప్పించాలంటూ ప్రజలు పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇన్నేండ్లుగా సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నామని, అధికారం వచ్చినందున ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలన్నీ మన పార్టీ వారికే ఇవ్వాలని కిందిస్థాయి నాయకులు ఎమ్మెల్యేలపై కూడా ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇప్పటికే పలువురు కిందిస్థాయి నాయకులు ఆయా గ్రామాలకు సంబంధించిన నాయకుల లిస్టులను కూడా సిద్ధం చేసుకుని దగ్గర పెట్టుకుని తిరుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో సంక్షేమ పథకాలు ఎవరికి అందుతాయన్నది మిస్టరీగా మారింది.

# చేయని పనులకు బిల్లులు

### జీహెచ్ఎంసీ నిర్వహణ పనుల్లో అక్రమాలు

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ ): జీహెచ్ఎంసీలో జరుగుతున్న నిర్వహణ పనుల్లో అక్రమాలకు తావులేకుండా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. బడ్జెట్ కేటాయింపుల నుంచి బిల్లుల చెల్లింపు వరకు సమగ్ర పరిశీలన చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే జోనల్ కమిషనర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, సంబంధిత డీడీవోతో కలిసి ప్రత్యక్షంగా పనులు పరిశీలించి అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న విధానాలకు అదనంగా వీటిని తప్పకుండా పాటించాలని కమిషనర్ ఇలంబర్తి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. పనులకు సంబంధించిన బిల్లులు రూపొందించే సమయంలో జోనల్ కమిషనర్ల ఆమోదం తప్పనిసరి చేశారు. ప్రతి బిల్లునూ జోనల్ కమిషనర్లు పరిశీలించిన తర్వాతనే ఆడిట్‌కు పంపాలని, ఈ క్రమంలో నిర్ణీత విధానాలు పాటించారా? లేదా? అన్నది చూడనున్నారు.

### ఫిబ్రవరి 3న జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఫిబ్రవరి 3న సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాస్తవంగా ప్రతి మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) జరగాల్సి ఉన్నది. గత జూలై 6న జరిగిన 9వ పాలకమండలి (సర్వసభ్య సమావేశం) అక్టోబర్‌లో జరపాల్సి ఉన్నది. కానీ ఐదు నెలలు గడిచినా సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కమిషనర్, మేయర్ సిద్ధపడలేదు. ఎట్టకేలకు వచ్చే నెల మొదటి వారంలో జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 150 ప్రశ్నలతో పాటు స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేక చర్చ జరగనున్నది.

- కొందరు ఏజెన్సీలు, అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదులు
- అంతర్గత విచారణకు రంగంలోకి విజిలెన్స్ బృందాలు
- ఇక మీదట అక్రమాలకు తావు లేకుండా జోనల్ కమిషనర్ అనుమతి ఉంటేనే బిల్లులు



### రెండేండ్ల పనులపై నిఘా

జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు రూ.1500కోట్ల మేర బకాయిలు పడింది. ఈ నేపథ్యంలో తరచూ ఆందోళనలు చేయడం, జూన్ నాటికల్లా రూ. 400కోట్ల మేర బకాయిలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్లు తాత్కాలికంగా నిరసనను వాయిదా వేశారు. అయితే ఇటీవల జరిగిన వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జరిగిన పనుల్లో అక్రమాలు జరిగినట్లు కమిషనర్ దృష్టికి వచ్చాయి. చేయని పనులకు బిల్లులు పెట్టడం, గతంలో కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ఖజానాకు గండికొట్టారన్న ఆరోపణల నేపథ్యంలో పాత బిల్లులపై నిఘా పెట్టి తనిఖీలు చేయాలని కమిషనర్ అంతర్గత ఆదేశాలు జారీ చేశారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన నిర్వహణ పనులకు చెల్లించిన బిల్లులపై విజిలెన్స్ బృందం రంగంలోకి దిగి విచారణ చేపట్టనున్నది.

# మరో 11 సహకార సంఘాలు

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు

### రంగారెడ్డి జిల్లాలో 46కు చేరనున్న సహకార సంఘాలు

రంగారెడ్డిజిల్లాలో మరో 11 సహకార సంఘాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు కొత్తగా సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించిన అధికారులు కొత్తగా సహకార సంఘాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం జిల్లాలో 35 సహకార సంఘాలున్నాయి. కొత్తగా 11 సహకార సంఘాలు ఏర్పాటైతే వీటి సంఖ్య 46కు చేరనున్నది. జిల్లాల పునర్విభజనతో రంగారెడ్డిజిల్లాలోకి షాద్‌నగర్ నియోజకవర్గంతోపాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలు చేరాయి. వీటి చేరికతో ప్రస్తుతం జిల్లాలో సహకార సంఘాల సంఖ్య 35గా ఉన్నది. గతంలో నిర్వహణ భారంగా మారిన పలు సహకార సంఘాలను రద్దు చేసింది. ప్రస్తుతమున్న సహకార సంఘాల పరిధి పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క సహకార సంఘం మాత్రమే ఉన్నది. జిల్లాలోని అతిపెద్ద మండలాలైన అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం, మంచాల మండలాలకూ ఒకే ఒక్క సహకార సంఘం చొప్పున ఉన్నాయి. సహకార సంఘాల పరిధి పెరిగినందున రైతులకు సహకార సంఘాలు సరైన సహకారాన్ని అందించడంలేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

- రంగారెడ్డి, జనవరి 19 (నమస్తే తెలంగాణ)

### కొత్తగా ఏర్పాటు కానున్న సహకార సంఘాలు

| మండలం | సహకార సంఘం |
|---|---|
| ఆమనగల్లు | కడ్తాల్ |
| తలకొండపల్లి | వెల్జాల్ |
| యాచారం | మాల్ |
| మంచాల | బోడకొండ |
| మంచాల | ఆరుట్ల |
| ఇబ్రహీంపట్నం | ఎలిమినేడు |
| షాద్‌నగర్ | హైతాపూర్ |
| కొందుర్గు | చౌదరిగూడెం |
| కందుకూరు | నేదునూరు |
| కందుకూరు | రాచులూరు |
| మహేశ్వరం | అమీర్‌పేట్ |




### 46కు చేరుకోనున్న సహకార సంఘాలు

జిల్లాలోని 21 మండలాలు, 13 మున్సిపాలిటీలు, 2 మున్సిపల్ కార్పొరేషన్లతో కలిపి మొత్తం 35 సహకార సంఘాలున్నాయి. వీటిలో ప్రస్తుతం ఇబ్రహీంపట్నం మండలంలో మంగల్‌పల్లి పటేల్‌గూడ, ఉప్పరిగూడ, దండుమైలారం, పోల్కంపల్లి సహకార సంఘాలున్నాయి. మిగతా చోట్ల మండలానికి ఒకటి చొప్పున సహకార సంఘాలున్నాయి. కొత్తవాటితో కలిపి వీటి సంఖ్య 46కు చేరుకోనున్నది. ప్రస్తుత సహకార సంఘాల పదవీకాలం వచ్చే నెల 15తో ముగియనున్నది. వాటితో పాటు కొత్తవాటికి కూడా ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. కాని, ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఇప్పటివరకూ ప్రారంభించలేదు. దీంతో సకాలంలో సహకార సంఘాలకు ఎన్నికలు జరుగుతాయా.. లేక పదవీకాలం పొడిగిస్తారా అనేది సస్పెన్స్‌లో ఉన్నది. సకాలంలో ఎన్నికలు జరిగితే కొత్తవాటికీ ఎన్నికలు జరిగి, మరికొంతమందికి రాజకీయంగా పదవులు లభించే అవకాశాలున్నాయి.

### కొత్త సంఘాల ఏర్పాటుతో రైతులకు ఎంతో ఉపయోగం



కొత్తగా ఏర్పాటు కానున్న సహకార సంఘాల ద్వారా రైతులకు సేవలు సులభతరం కానున్నాయి. ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఉన్న సహకార సంఘాలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం నూతనంగా రైతులకు సేవలు మరింత చేరువ చేసేందుకు నూతనంగా సహకార సంఘాలను ఏర్పాటు చేయడం సంతోషకరం. - కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఆరుట్ల



# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

- నగర కమిషనరేట్‌లో 573 ఏఆర్ కానిస్టేబుళ్లు
- వివిధ విభాగాలకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- ఇది కేవలం అటాచ్‌మెంట్ మాత్రమే ..
- నగర కమిషనర్ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న 573 మంది ఏఆర్ కానిస్టేబుళ్లను శాంతి భద్రతల విభాగంతో పాటు ఇతర విభాగాలకు అటాచ్ చేస్తూ నగర సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్‌కు 284, ట్రాఫిక్ 225, మిగతా వాళ్లను ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ, సైబర్ క్రైమ్ విభాగాలకు అటాచ్ చేశారు. ఇందులో 223 మంది మహిళలు, 350 మంది పురుషులున్నారు. ఈ మేరకు ఆదివారం కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏఆర్ కానిస్టేబుళ్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ వీనీ ఆనంద్ మాట్లాడుతూ .. శాంతిభద్రతల విభాగంతో పాటు ఇతర విభాగాలను మరింత మెరుగుపరచడంలో భాగంగా సివిల్ కానిస్టేబుళ్లకు అదనంగా ఏఆర్ కానిస్టేబుళ్లను ఆయా విభాగాలకు అటాచ్ చేస్తున్నట్లు తెలిపారు.

### నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

ఇక నుంచి సివిల్ పోలీసులతో కలిసి ఏఆర్ పోలీసులు పనిచేయాలని సీపీ సూచించారు. చాలా సహనంతో, వివిధ వర్గాల ప్రజల మధ్య పనిచేయాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ రాజధాని కావడంతో శాంతి భద్రతలను కాపాడుకోవడం మనందరి ముఖ్య కర్తవ్యమన్నారు. ఇది కేవలం అటాచ్‌మెంట్ మాత్రమేనని, వారికి సీనియార్టీ లేదా విభాగ మార్పిడి హక్కులు ఉండవని, పోలీస్‌స్టేషన్లలో పెట్రోలింగ్, ప్రాథమిక విధులు నిర్వహించే సిబ్బంది సివిల్ పోలీసుల కొరతను అధిగమించడానికి ఈ విధంగా అటాచ్‌మెంట్ చేస్తున్నామన్నారు. నగరంలో ప్రశాంతత ఉన్నప్పుడే పెట్టుబడులు వచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, నగరానికి తద్వారా రాష్ట్రానికి మంచిపేరు వస్తుందన్నారు.